# బడిలో సౌర వెలుగులు

- గజ్వేల్ మండలంలో పూర్తయిన ప్రక్రియ
- సోలార్‌తో పాఠశాలల్లో నిరంతర విద్యుత్
- తీరనున్న కరెంట్ బిల్లుల బాధ



గజ్వేల్ పాఠశాలలో ఏర్పాటు చేసిన సోలార్ ప్యానల్స్ వద్ద విద్యార్థులు(ఫైల్)

గజ్వేల్, అక్టోబర్ 24: ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేసే దిశగా ప్రభుత్వం చేపడుతున్న చర్యలతో గ్రామీణ ప్రాంత పాఠశాలల్లో మౌలిక వసతులతోపాటు అన్నిరకాల సదుపాయాలు అందుబాటులోకి వస్తున్నాయి. పాఠశాలల్లో రోజురోజుకు కరెంట్ వినియోగం పెరుగుతున్న నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక ప్రణాళికను రూపొందించింది. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులు నిరంతరం విద్యుత్‌ను వినియోగించుకునే విధంగా సోలార్ యూనిట్లను ఏర్పాటు చేయనుంది. సోలార్ యూనిట్ల ఏర్పాటుతో ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులకు నిరంతరం విద్యుత్ ఉండడంతో కంప్యూటర్ ల్యాబ్‌ల వినియోగానికి ఎలాంటి ఆటంకం ఉండదు. గజ్వేల్ మండలంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సోలార్ యూనిట్లను ఏర్పాటు చేశారు. సోలార్ వినియోగంతో ప్రభుత్వ పాఠశాలలకు ఆదాయంతో పాటు నిరంతరం కరెంట్ ఉంటున్నది. సోలార్ యూనిట్ల ఏర్పాటుతో బిల్లులు చెల్లించలేని పాఠశాలలకు కరెంట్ బాధలు తీరాయి.

### బిల్లుల చెల్లింపునకు తొలగిన ఇబ్బందులు

గజ్వేల్ మండలంలోని అహ్మదీపూర్, పిడిచేడ్, బెజుగామ, రిమ్మనగూడ, బంగ్లావెంకటపూర్, బూరుగుపల్లి, సింగాటం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో 3కేవీ సోలార్ యూనిట్లను ఏర్పాటు చేశారు. ప్రభుత్వ పాఠశాలల్లో ప్రతి నెలా విద్యుత్ బిల్లులు చెల్లించలేని పరిస్థితి ఉండడంతో ప్రభుత్వం బిల్లుల నుంచి ఉపశమనం కలిగేవిధంగా పాఠశాలలపై సోలార్ యూనిట్లను ఏర్పాటు చేసింది. ప్రభుత్వం సోలార్ యూనిట్లను ఏర్పాటు చేయించడంతో పాఠశాల అవసరాలకు పోనూ మిగిలిన యూనిట్లను తిరిగి విద్యుత్ శాఖనే తీసుకొని డబ్బులు చెల్లిస్తున్నది. ప్రతి నెలా సుమారుగా ఒక్కో పాఠశాలకు రూ.800 పైచిలుకు వరకు కరెంట్ బిల్లు వస్తుంది. నెలకోసారి బిల్లు చెల్లించలేని పాఠశాలలకు విద్యుత్ అధికారులు కరెంట్ కనెక్షన్‌ను తొలగించడంతో కంప్యూటర్ ల్యాబ్‌లకు విద్యార్థులు దూరమవుతున్నారు. అలాగే ఉక్కపోతతో ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. సోలార్ ఏర్పాటుతో ఇక ఇలాంటి సమస్యలు రాకుండా విద్యుత్ నిరంతరంగా ఉంటున్నది.

### 58 పాఠశాలల్లో ఏర్పాటుకు శ్రీకారం

మన ఊరు– మన బడి కార్యక్రమం కింద జిల్లాలోని 340 పాఠశాలలు ఎంపికయ్యాయి. ప్రస్తుతం ఈ పాఠశాలల్లో వివిధ రకాల పనులు కొనసాగుతున్నాయి. ప్రతి పాఠశాలలో 2 కిలోవాట్ల విద్యుత్ సామర్థ్యం కలిగిన సోలార్ యూనిట్లను మొదటి విడతలోఎంపిక చేసిన 58 జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో మూడు నెలల్లో ఏర్పాటు చేయనున్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో సోలార్ యూనిట్లను ఏర్పాటు చేయడంతో గ్రామీణ ప్రాంత పేద విద్యార్థులకు మేలు జరుగనుంది. పాఠశాలల్లో వీటి ఏర్పాటుతో కరెంట్ వినియోగం తగ్గడంతో పాటు సోలార్ ద్వారా ఉత్పత్తి అయిన విద్యుత్‌ను తిరిగి అమ్మడం ద్వారా పాఠశాలలకు ఆదాయం రానుంది. సోలార్ ప్లాంట్ల నిర్మాణం పూర్తయి వినియోగంలోకి వస్తే పాఠశాలలకు విద్యుత్ బిల్లుల బాధలు చాలా వరకు తొలగనున్నాయి.



సోలార్ విద్యుత్ మీటర్

### పాఠశాలలకు ఆదాయం

గజ్వేల్ మండలంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో ఏర్పాటు చేసిన సోలార్ యూనిట్లతో ప్రతి రోజూ 12 యూనిట్ల చొప్పున నెలలో 360 యూనిట్ల వరకు ఉత్పత్తి కానుంది. నెలలో సుమారు 100 నుంచి 150 యూనిట్లను వినియోగించుకున్నా మరో 160 యూనిట్ల వరకు ఆదా మిగులుతుంది. పాఠశాలలో ఉత్పత్తి అయ్యే విద్యుత్‌ను అధికారులు గ్రిడ్‌కు అనుసంధానం చేయడంతో వినియోగించుకున్న తర్వాత మిగిలిన ప్రతి యూనిట్‌కు రూ.3.25ల చొప్పున విద్యుత్ అధికారులు పాఠశాలకు డబ్బులు చెల్లించనున్నారు. దీంతో పాఠశాలకు ఆదాయం సమకూరనుంది.

## అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి

రాయపోల్, అక్టోబర్ 24: అనుమానాస్పద స్థితిలో ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటన రాయపోల్ మండల కేంద్రంలో మంగళవారం చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామానికి చెందిన అరికెల యాదగిరి(45) వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. సోమవారం రాత్రి 7 గంటల సమయంలో ఇంటి నుంచి బయటకు వెళ్లాడు. రాత్రి 9 గంటల తర్వాత అతడి భార్య, కుటుంబ సభ్యులు ఫోన్ చేయగా మిత్రులతో మద్యం తాగుతున్నట్లు తెలిపారు. యాదగిరి ఎంతకూ ఇంటికి రాకపోవడంతో ఆందోళన చెందిన కుటుంబ సభ్యులు ఎంత వెతికినా ఆచూకీ దొరకలేదు. మంగళవారం ఉదయం రాయపోల్ వైన్స్ ఎదుట ఉన్న డబ్బాల వద్ద శవమై కనిపించాడు. మృతుడి ఫోన్‌కు ఫోన్ చేయగా గ్రామానికి చెందిన కుర్మ శంకరయ్య వద్ద ఉంది. అతనితోపాటు మరి కొంత మంది కలిసి మద్యం సేవించారని మృతుడి భార్య పుణ్యావతి పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఈ మేరకు ఎస్సై రఘుపతి కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని పోస్ట్‌మార్టం నిమిత్తం గజ్వేల్ ప్రభుత్వ దవాఖానకు తరలించారు. యాదగిరి మృతితో రాయపోల్‌లో విషాదఛాయలు అలుముకున్నాయి.

## ఒకే కుటుంబంలో రెండు రోజుల్లో ఇద్దరు మృతి





రామరాజు నర్సయ్య(ఫైల్), లక్ష్మీ నర్సవ్వ(ఫైల్)

మిరుదొడ్డి, అక్టోబర్ 24: రెండు రోజుల వ్యవధిలోనే ఒకే కుటుంబంలో ఇద్దరూ మృతి చెందిన సంఘటన మిరుదొడ్డి మండల పరిధిలోని ధర్మారం గ్రామంలో సోమవారం, మంగళవారం రోజుల్లో చోటు చేసుకుంది. మృతుల బంధువులు, గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. ధర్మారం గ్రామానికి చెందిన రామరాజు నర్సయ్య(70) సోమవారం దసరా రోజు అకాల మృతి చెందాడు. మంగళవారం నర్సయ్య అంత్యక్రియలకు ఏర్పాట్లు చేస్తున్న క్రమంలో నర్సయ్య వదిన లక్ష్మీనర్సవ్వ (65) గుండె పోటుతో మృతి చెందింది. దీంతో కుటుంబ సభ్యులు కన్నీటి పర్యంతమయ్యారు. రెండు రోజుల వ్యవధిలో ఒకే కుటుంబంలో ఇద్దరు మృతి చెందడంతో ధర్మారం గ్రామంలో విషాదఛాయాలు అలుముకున్నాయి.

## 29న జూడో క్రీడాకారుల ఎంపిక

సిద్దిపేట, అక్టోబర్ 24: స్థానిక డిగ్రీ కళాశాల మైదానంలో(గ్రీన్ ఫీల్డ్ స్టేడియంలో) ఈ నెల 29వ తేదీన ఉమ్మడి మెదక్ జిల్లాస్థాయి (సిద్దిపేట, మెదక్, సంగారెడ్డి) అండర్ –14 అండర్– 17 విభాగాల్లో బాల, బాలికల జూడో క్రీడాకారులను ఎంపిక చేస్తామని ఎస్‌జీఎఫ్ సెక్రటరీ రామేశ్వర్‌రెడ్డి, జూడో సెక్రటరీ భరత్‌రెడ్డి తెలిపారు. ఉమ్మడి మెదక్ జిల్లాకు చెందిన ఆసక్తి గల క్రీడాకారులు 29వ తేదీ ఉదయం 10 గంటల వరకు తగిన ధ్రువీకరణ పత్రాలతో (10వ తరగతిలోపు చదువుతున్న విద్యార్థులు అయితే పాఠశాల బోనాఫైడ్ సర్టిఫికేట్, ఇంటర్ చదివే విద్యార్థులు 10వ తరగతి ఉత్తీర్ణత సర్టిఫికెట్)హాజరు కావాలన్నారు. ఉమ్మడి జిల్లాస్థాయిలో ఎంపికైన క్రీడాకారులు హన్మకొండ జిల్లాలో నవంబర్ 2వ తేదీ నుంచి జరుగే ఎస్‌జీఎఫ్ రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారని సిద్దిపేట జిల్లా పాఠశాల క్రీడల సమాఖ్య కార్యదర్శి పన్యాల రామేశ్వర్ రెడ్డి తెలిపారు. వివరాల కోరకు రామేశ్వర్ రెడ్డి, ఎస్‌జీఎఫ్ సెక్రటరీ 94948 76376, గన్నె భరత్ రెడ్డి జూడో అసోసియేషన్ సెక్రటరీ సిద్దిపేట జిల్లా 9246666472లను సంప్రదించాలన్నారు.

## కమిషనరేట్‌లో ఆయుధపూజ

సిద్దిపేటరూరల్, అక్టోబర్ 24: సిద్దిపేట కమిషనరేట్‌లో సోమవారం ఆయుధపూజను ఘనంగా నిర్వహించారు. పెద్దకోడూర్ శివారులోని సాయుధ దళాల కార్యాలయంలో ఆయుధాలకు, ప్రభుత్వ వాహనాలకు వేదమంత్రాలతో శాస్త్రోక్తంగా పూజలు జరిపించారు. జమ్మిచెట్టుకు ప్రత్యేక పూజలు చేసిన అనంతరం సీపీ మాట్లాడుతూ ప్రతి పనిలో అధికారులు, సిబ్బంది విజయం సాధించాలని, ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందించాలని సూచించారు. కార్యక్రమంలో అడిషనల్ డీసీపీలు రామచంద్రరావు, సుభాష్‌చంద్రబోస్, అందె శ్రీనివాసరావు, ఎస్.మల్లారెడ్డి, సిద్దిపేట ఏసీపీ సురేందర్‌రెడ్డి, రిజర్వ్ ఇన్‌స్పెక్టర్లు ధరణికుమార్, పూర్ణచందర్, ప్రసాద్, రాజేశ్, సిద్దిపేట రూరల్ సీఐ చేరాలు, ఆర్ఎస్ఐలు రోహిత్, సురేశ్‌కుమార్, రంజిత్, నిరంజన్, సాయిచరణ్, సాయిప్రసాద్, మహిళా ఆర్ఎస్ఐ పుష్ప, చిన్నకోడూర్ ఎస్ఐ సుభాష్‌గౌడ్, ఏఆర్ అధికారులు, సిబ్బంది, వాహనాల డ్రైవర్లు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.



ఆయుధ పూజలో సీపీ శ్వేత, ఇతర అధికారులు

## ముగిసిన దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు

మద్దూరు(ధూళిమిట్ట), అక్టోబర్ 24 : మద్దూరు మండలం గాగిల్లాపూర్ కాళీ మాత ఆశ్రమంలో మహాయోగిని కాళీమాత(తల్లి) ఆధ్వర్యంలో తొమ్మిది రోజులు నిర్వహించిన దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు మంగళవారం ముగిశాయి. ఈ సందర్భంగా డోలుచప్పుళ్లు, భజన, సంకీర్తనలతో దుర్గాదేవి విగ్రహాన్ని ప్రత్యేకంగా తయారు చేసిన ఓ వాహనంలో గ్రామ పురవీధుల్లో ఊరేగించారు. మహిళలు మంగళహారతులతో అమ్మవారికి ఘనంగా స్వాగతం పలికారు. భక్తులకు నిర్వాహకులు తీర్థప్రసాదాలు అందజేశారు. అనంతరం దుర్గామాత విగ్రహ నిమజ్జనోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## గజ్వేల్ మహంకాళికి ఘనంగా పట్టాభిషేకం

గజ్వేల్‌అర్బన్, అక్టోబర్ 24: గజ్వేల్ పట్టణంలో దస రా పండుగను ప్రజలంతా సోమవారం ఘనంగా జరుపుకున్నారు. గజ్వేల్‌లో ప్రజలంతా సీతారామాలయం నుంచి డప్పుచప్పుళ్లతో బయలుదేరి గజ్వేల్ మహంకాళి ఆలయానికి చేరుకున్నారు. ఆలయం వద్ద అమ్మవారిని దర్శించుకొని శమీ పూజ నిర్వహించారు. అనంతరం ఒకరికొకరు ఆలింగనం చేసుకొని బంగారం ఇచ్చిపుచ్చుకొని దసరా శుభాకాంక్షలు తెలుపుకున్నారు. మున్సిపల్ చైర్మన్ ఎన్‌సీ రాజమౌళి, ఆలయ కమిటీ అధ్యక్షుడు కాల్వ శ్రీధర్‌రావు, ఏసీపీ రమేశ్ తదితరులు ఆలయం వద్ద ఏర్పాటు చేసిన వేదికపై ప్రసంగించారు. ఆలయాభివృద్ధి, హైందవ సంస్కృతి అభివృద్ధికి ప్రతిఒక్కరూ కృషి చేయాలని ఈ సందర్భంగా ఆలయ ప్రధానార్చకులు చాడ నందబాలశర్మ పిలుపునిచ్చారు. ఆలయ పునర్నిర్మాణం తర్వాత ఉత్సవాలను వైభవంగా నిర్వహించుకుంటున్నామని తెలిపారు. ప్రతి ఏడాది ఉత్సవాలకు హాజరయ్యే ప్రజల సంఖ్య పెరుగుతున్నదని కాల్వ శ్రీధర్ రావు అన్నారు. ప్రజలందరికీ ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ రాజమౌళి, పట్టణ ప్రముఖులు దసరా శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం రావణదహనం నిర్వహించారు. మంగళవారం గజ్వేల్ మహంకాళి అమ్మవారికి ఉత్సవ కలశ జలాలతో అభిషేకాలు చేసి, పట్టాభిషేకాన్ని ఘనంగా నిర్వహించారు.



## కొమురవెల్లిలో ముగిసిన ఉత్సవాలు

చేర్యాల, అక్టోబర్ 24 : కొమురవెల్లి ఆలయంలో దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు మంగళవారం ముగిశాయి. ఈ సందర్భంగా దుర్గామాత విగ్రహాన్ని ఊరేగించి దేవాలయ పుష్కరిణి(ధర్మగుండం) వరకు తీసుకెళ్లి త్రిశూల స్నానం చేయించారు. కార్యక్రమంలో ఆలయ ఏఈవో వైరాగ్యం అంజయ్య, పర్యవేక్షకుడు చంద్రశేఖర్, ఆలయ ప్రధాన అర్చకులు మల్లికార్జున్, స్థానాచారి మల్లయ్య, రవి, భాస్కర్, మనోహర్, వినయ్‌కుమార్, బసవేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్
WANTED
★ రామకృష్ణ గ్రూప్ (TS & AP No. 1) Hyd., VJA. శ్రీమంతుల ఇండ్లలో వృద్ధుల సేవకు ఇంటి/వంట పని, బేబీకేర్ కొరకు వర్కర్లు (M/F) కావలెను. భో+వ+జీతం: 15–21 వేలు. ఏజెంట్లకు కమీషన్: 5,000/-. Ph: 9281452833, 6281208600.
NT-320535
గమనిక: క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్/డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.